క్లుప్తంగా

సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ ఖోఖో పోటీలకు కేడీసీ విద్యార్థి ఎంపిక



విద్యారణ్యపురి: బెంగుళూరులోని అలియన్స్ యూనివర్సిటీలో ఈనెల 23నుంచి 26వరకు నిర్వహించనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో టోర్నమెంట్‌కు హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి టి.ఐశ్వర్య ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సోమన్న శుక్రవారం తెలిపారు. ఈ మేరకు కళాశాలలో ఐశ్వర్యను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల గేమ్స్ కమిటీ బాధ్యులు డాక్టర్ ఆలువాల సంజీవయ్య, వినోద్‌రావు, సోమ నర్సయ్య, కమలాకర్, విజయపాల్‌రెడ్డి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఉంగరం అప్పగింత



వరంగల్: నగరంలోని ఒక షాపింగ్ మాల్‌లో షాపింగ్ చేస్తూ పోగొట్టుకున్న రూ.35వేల విలువైన ఉంగరాన్ని తిరిగి అందించడం అభినందనీయమని ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేసి పదవీవిరమణ పొందిన అధికారి వింజమూరి లక్ష్మీ ప్రసాద్‌రావు అన్నారు. వారం క్రితం కుటుంబ సభ్యులతో కలిసి ఒక షాపింగ్ మాల్‌లో షాపింగ్ చేస్తున్న సమయంలో బంగారు ఉంగరం పోయిందని ఆయన అన్నారు. ఆ విషయమై మాల్ ఉద్యోగులకు ఫిర్యాదు చేయగా, మాల్‌లో పనిచేస్తున్న సిబ్బందికి ఉంగరం దొరకడంతో శుక్రవారం తమకు అందజేశారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది నిజాయితీని మెచ్చుకొని సన్మానించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాల్ మేనేజర్ కిరణ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రాజేష్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు మర్యాదగా మెలగాలి



ఖిలా వరంగల్: ఆటో డ్రైవర్లు.. ప్రయాణికులకు భద్రత కల్పించడమే కాకుండా వారితో మర్యాదగా మెలగాలని మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్ సూచించారు. మిల్స్‌కాలనీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ అందజేసిన ఆటో అడ్డా నంబర్, స్టిక్కర్లను వరంగల్ 37, 38 డివిజన్ల పరిధి పడమర కోట జంక్షన్‌లో అడ్డా అధ్యక్షుడు గద్దల బాబు ఆధ్వర్యంలో ఆటోలకు శుక్రవారం అంటించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ ఏదైనా ప్రమాదం జరిగితే స్టికర్ల ద్వారా ఆటోతో పాటు డ్రైవర్‌ను సులభంగా గుర్తించవచ్చని వివరించారు. ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బోగి సురేష్, న్యాయవాది తీగల జీవన్, నలిగంటి నవీన్, అభిషేక్ రాంబాబు, ఆటో సంఘం నాయకులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

హసన్‌పర్తి: ఎల్లాపురానికి చెందిన కాశేశ్వరం కట్టమ్మ – వీరస్వామి జ్ఞాపకార్థం వారి కుమారుడు నరసింహారావు 65వ డివిజన్ ఎల్లాపురంలో శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భారత జాతీయ మహిళా సమాఖ్య, భారత కమ్యూనిటీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేదునూరి రాజమౌళి, సీపీఐ నాయకులు సారయ్య, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

అనాథకు నిత్యావసరాల అందజేత



మడికొండ: సంక్రాంతి పండుగ సందర్భంగా ఒంటరి అనాథ మహిళ బత్తిని సక్కుబాయికి 25కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను మడికొండ హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ జయరాజ్‌ను స్థానికులు అభినందించారు.

రేపు ఉచిత వైద్య క్యాన్సర్ శిబిరం

నయీంనగర్: గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, బాప్టిస్ట్ మిషన్ హాస్పిటల్ హనుమకొండ సౌజన్యంతో ఈనెల 15న హనుమకొండ బాప్టిస్ట్ మిషన్ హాస్పిటల్‌లో ఉచిత వైద్య క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు డాక్టర్ నెల్సన్, డాక్టర్ టి.క్రిస్టఫర్ రూబెన్ తెలిపారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ ప్రముఖ క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ సుంకుపల్లి చిన్నబాబు పర్యవేక్షణలో డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఉచిత వైద్య, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, గుండె జబ్బులు, మానసిక వ్యాధి, షుగర్, జనరల్ చెకప్ పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. అనంతరం మమ్మోగ్రఫీ, చెస్ట్ ఎక్స్‌రే, పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తారని వివరించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలతో జంగా రాఘవరెడ్డి, జంగా సుజాత, తదితరులు



సమ్మయ్యనగర్‌లో మహిళలు వేస్తున్న ముగ్గులను పరిశీలిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



హనుమకొండలోని సీపీఐ కార్యాలయంలో..



నగరవ్యాప్తంగా సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పండుగల ప్రాధాన్యతను భవిష్యత్ తరాలకు తెలియజెప్పాలని పలువురు సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



40వ డివిజన్‌లో బహుమతులు అందజేస్తూ..



ఖిలా వరంగల్ వందన హైస్కూల్‌లో..



కాజీపేట ప్రశాంత్‌నగర్ కాలనీలో



కడిపికొండ గ్రామంలోని కాళోజీ ఇంద్రానగర్‌లో..



పోచమ్మమైదాన్‌లో సంక్రాంతి సంబరాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సారయ్య

బీజేపీలో క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలు

హన్మకొండ: బీజేపీ కార్యకర్తలు క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేస్తారని నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ ప్రభారీ, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. బీజేపీ నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ ప్రభారీగా నియమితులైన ధర్మారావును హనుమకొండ రాంనగర్‌లోని ఆయన స్వగృహంలో బీజేపీ నాయకుడు బన్న ప్రభాకర్ ఆధ్వర్యంలో పూర్వ హనుమకొండ మండలంలోని 23 గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు, సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జ్ చాడ శ్రీనివాస్ రెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, నాయకులు మాకుల రవీందర్, భాష బోయిన కుమార్, చక్రపాణి, కిషోర్, రాంరెడ్డి, రమేష్, రాజు, రాకేష్‌రెడ్డి, కిట్టు, రామ్‌యాదవ్, ఉపేందర్, శ్రీనివాస్, మూర్తి, సదానందం, సమ్మయ్య, ప్రణయ్, విజయ్, రానాయాదవ్ పాల్గొన్నారు.



ధర్మారావును సన్మానిస్తున్న నాయకులు

గోల్డ్‌మెడల్ అందజేత



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో బీటెక్ (కంప్యూటర్ సైన్స్) విద్యార్థి కనికపాటి లక్ష్మీత్రిజాని.. 22వ స్నాతకోత్సవంలో గోల్డ్‌మెడల్ తీసుకోవాల్సి ఉండగా అనివార్య కారణాలతో అందుకోలేదు. ఈమేరకు ఆమె తల్లిదండ్రులు కనికపాటి నాగేశ్వరి, విజయభాస్కర్‌రావు శుక్రవారం యూనివర్సిటీకి రాగా, వారికి గుజ్జుల శరత్‌చంద్ర మెమోరియల్ గోల్డ్‌మెడల్‌ను వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అందించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి, ప్రొఫెసర్ శ్రీనివాసులు ఉన్నారు.

ప్రొఫెసర్ శ్రీనివాసులుకు సన్మానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ శ్రీనివాసులు ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఈమేరకు ఆయనను వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా వీసీ రమేష్ మాట్లాడుతూ శ్రీనివాస్ సేవలు మరువలేనివని కొనియాడారు. ఇంజనీరింగ్ విభాగంలో వివిధ కమిటీల్లో పలు జాతీయ సంస్థలతో కేయూకు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవటంలో ఆయన కీలకభూమిక పోషించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఇంజనీర్‌కు అభినందన

కేయూ క్యాంపస్: జయశంకర్ భూపాలపల్లి జెన్కో చీఫ్ ఇంజనీర్ ముత్యాల సిద్దయ్య కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య సన్మానించారు.

మహిళ ఆత్మహత్య

ఖిలా వరంగల్: ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురైన ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఖిలా వరంగల్ మధ్యకోటలో గురువారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మధ్యకోట ముస్లిం వీధికి చెందిన షఫీతో ఎనిమిదేళ్ల క్రితం సమీన (సమ్రీన్)(28) వివాహం జరిగింది. షఫీ కూలిపని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వారికి ఏడేళ్ల కుమార్తె ఉంది. గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో దంపతుల మధ్య గొడవలు ప్రారంభయ్యాయి. దాంతో సమీన బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలి తల్లి గౌసియాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు.

పోలీసులకు చిక్కిన దొంగ

- మూడు లాప్‌ట్యాప్‌లు స్వాధీనం

హసన్‌పర్తి: దొంగతనం చేసిన లాప్‌ట్యాప్‌లు అమ్మడానికి వచ్చిన ఓ వ్యక్తి.. పోలీసులకు చిక్కాడు. కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌పరిధిలోని భీమారంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. కాకతీయ యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ దయాకర్ తెలిపిన వివరాల ప్రకారం భీమారం బస్టాండ్ వద్ద శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఓ యువకుడు అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని విచారించగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూరుకు చెందిన కోడపాక రవికిరణ్ బ్యాగ్‌ను తనిఖీ చేయగా చోరీ చేసిన మూడు లాప్‌ట్యాప్‌లు లభ్యమయ్యాయి. ఈమేరకు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ దయాకర్ తెలిపారు.

వాకర్స్ సమస్యల పరిష్కారానికి కృషి



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

కరీమాబాద్: రంగలీల మైదానంలో వాకర్స్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమం శుక్రవారం జరిగింది.

కమిటీ అధ్యక్షుడిగా అంబేద్కర్

రంగలీల మైదానం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బొమ్మల్ల అంబేద్కర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా గుడిమెల్ల మోహన్, పార్వతికృష్ణన్, రాజు, బజ్జూరి వాసు, వెంగల సదానందం, ప్రధాన కార్యదర్శిగా సిరంగి రాజ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా కదరి కుమార్, అంకం ప్రవీణ్, బత్తుల రమేష్, వసూరి శ్రీను, కన్నబోయిన రవియాదవ్, కోశాధికారిగా కోదాటి శ్యాం, సహాయ కోశాధికారిగా రణం శ్రీను, సభ్యులుగా పరశురాం, కిరణ్, శ్రీను, కుమార్, లక్ష్మణ్, రాజేందర్, శ్రీధర్, గోపాల్, శ్రీను, రాజు, మల్లేశం, నాగరాజు, రంజిత్, మనోహర్, రవి, రమేష్, శ్రీను, కుమార్, కిరణ్‌ను ఎన్నుకోగా, వారు ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే, ఉర్సు బండ్‌ను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నరేందర్ అన్నారు. రంగలీల మైదానంతో వాకర్స్‌తో కలిసి అభివృద్ధి పనుల గురించి చర్చించారు.

స్వయం ఉపాధికి చేయూత

న్యూశాయంపేట: నిరుపేదలకు స్వయంఉపాధి కోసం తోపుడు బండ్లు అందించి చేయూతనివ్వడం అభినందనీయమని రీజినల్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ షాయిద్ మసూద్ అన్నారు. రహబర్ ఫౌండేషన్, షఫా బైతుల్ మాల్ సంయుక్త ఆధ్వర్యంలో వరంగల్ ఎల్బీనగర్ ఈద్గా ఆవరణలో సుమారు వందమందికి తోపుడు బండ్లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మహ్మద్ ఫుర్ఖాన్ మాట్లాడుతూ సంస్థ ద్వారా అందించిన సహాయాన్ని అందిపుచ్చుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ముఫ్తీ మినాజ్ అహ్మద్, షాహిద్ అహ్మద్, ఖాజా ఫరీరుద్దీన్, మునవర్ హుస్సేన్, ఖాజా ఖద్రుద్దీన్, అక్తర్, జావేద్, ఫయాజుద్దీన్, అబ్దుల్ హఫీజ్ పాల్గొన్నారు.



తోపుడు బండ్లను అందజేస్తున్న సంస్థ బాధ్యులు

క్రికెట్ టోర్నమెంట్‌కు రైల్వే స్టేడియం ముస్తాబు



స్టేడియాన్ని పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

కాజీపేట రూరల్: క్రికెట్ టోర్నమెంట్‌కు కాజీపేట రైల్వే స్టేడియం రైల్వే ఇన్‌స్టిట్యూట్ కమిటీ సభ్యులు ముస్తాబు చేశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో రైల్వే కార్మికులకు పోటీలు నిర్వహించనున్నట్లు సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, శుక్రవారం తెలిపారు. ఈనెల 17న క్రికెట్ పోటీలు ప్రారంభమవుతాయని ఆయన వివరించారు.

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలకు తరలిన శ్రేణులు

విద్యారణ్యపురి: రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో ఈనెల 13, 14తేదీల్లో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఐదవ రాష్ట్ర మహాసభలకు హనుమకొండ, వరంగల్ జిల్లాల శాఖల బాధ్యులు, ఉపాధ్యాయులు హనుమకొండలోని డీఈఓ కార్యాలయం నుంచి శుక్రవారం తరలివెళ్లారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ మహాసభల్లో విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఇరు జిల్లాల టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సదాశివరెడ్డి, పెండెం రాజు, తాటికాయల కుమార్, బద్దం వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు సీహెచ్.రవీందర్‌రాజు, కోశాధికారి కిరణ్‌కుమార్, బాధ్యులు సుజన్ ప్రసాద్‌రావు, అన్నాదేవి కార్యదర్శులు సీఎస్ఆర్ మల్లిక్, మోజెస్, భాస్కరరావు, పాక శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మహాసభలకు వెళ్తున్న బాధ్యులు, ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హసన్‌పర్తి: 66వ డివిజన్ హసన్‌పర్తిలోని మహాత్మా గాంధీ విద్యాలయం ఎస్సెస్సీ (1995 –96) పూర్వ విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ గత మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం, విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, కిషన్ రెడ్డి, పెద్దులు, సుధాకర్, అరుణ, అజీం నిర్వాహకులు కాజీపేట శోభ, వెల్గటి రాజిరెడ్డి, నన్నంశెట్టి రుషీ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తి: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కాజీపేట బాలుర పాఠశాలలో..

కాజీపేట: కాజీపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1981–82లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.



కాజీపేటలో..

మద్యం మత్తులో యువకుల హల్‌చల్

రామన్నపేట: మద్యం మత్తులో వరంగల్ మండిబజార్‌లో యువకులు హల్‌చల్ చేసిన ఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రెండు వర్గాల యువకులు కర్రలతో పరస్పరం దాడికి దిగి నానా వీరంగం సృష్టించారు. మండిబజార్‌లో తెల్లవారుజాము వరకు బిర్యానీ, బెల్ట్ షాపులు, టిఫిన్ సెంటర్లు తెరిచి ఉండడంతో ఆ ప్రాంతంలో యువకులు సంచరించడం పరిపాటిగా మారింది. ఇటీవల అర్ధరాత్రి ఓ అడ్వకేట్ హోటల్‌కు వచ్చి బిర్యానీ తినివెళ్తున్న క్రమంలో ఆయనపై విధుల్లో ఉన్న పోలీసులు దుర్భాషలు ఆడారని న్యాయవాదులు సైతం ఆందోళన చేసిన విషయం విదితమే. ఆ ఘటన మరిచిపోకముందే మండిబజార్ ప్రాంతంలోనే యువకులు మద్యం మత్తులో బీభత్సం సృష్టించడం వివాదాస్పదంగా మారింది. అలాగే, మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి సమయాల్లో వ్యాపారం సాగిస్తున్న 14 మంది హోటల్ యజమానులను వరంగల్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు. ఆరు నెలల కాలానికి రూ.లక్ష పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

కష్టపడి చదివితే లక్ష్యం సులువు

హన్మకొండ: ఆత్మవిశ్వాసంతో కష్టపడి చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చని, ఐఐటీ, మెడికల్ కళాశాలల్లో సులభంగా సీట్లు సాధించవచ్చని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ తాటికొండ రమేష్ అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో మోషన్ కాలేజీ టాలెంట్ టెస్ట్‌లో మెరిట్ సాధించిన విద్యార్థులకు అవార్డులు, జ్ఞాపికలు, స్కాలర్‌షిప్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విషయ పరిజ్ఞానంతో పాటు మెలకువలు నేర్చుకున్నప్పుడే పోటీ పరీక్షల్లో రాణించగలుగుతారని చెప్పారు. మోషన్ కళాశాల నిర్వహించిన టాలెంట్ టెస్టులో మొదటి పది ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రూ.10 లక్షల స్కాలర్‌షిప్‌లు అందివ్వడం, అలాగే టాలెంట్ పరీక్ష రాసిన విద్యార్థులందరికీ ఫీజులో 30% రాయితీ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కాకతీయ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ బైరి లక్ష్మీనారాయణ, ఆర్ఇసీ ప్రొఫెసర్ సతీష్ బాబు, మోషన్ కాలేజీ బ్రాంచ్ మేనేజర్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ చిర్ర గణేష్, ఆయా సంఘాల నాయకులు రమేష్ రావు, సంగ వెంకట్రాజం, ఉపేందర్, శంకర్, దాడి మల్లయ్య, పంజాల మధు, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థికి స్కాలర్‌షిప్ అందిస్తున్న వీసీ రమేష్

ఫాసిజానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మూర్తి

హసన్‌పర్తి: ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రతీఒక్కరు ఉద్యమించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్రకమిటీ సభ్యుడు నైనాలశెట్టి మూర్తి పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం ముచ్చర్లలో రాష్ట్ర కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య భారతదేశంలో మతతత్వ రాజకీయాలతో కేంద్ర ప్రభుత్వం.. విభజించి పాలిస్తోందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగేతర శక్తిగా మారిందని అన్నారు. పెట్టుబడిదారులను పాలకులు అందలం ఎక్కిస్తూ మైనార్టీలపై దాడులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఫిబ్రవరి 15నుంచి 20వరకు బిహార్‌లోని పట్నాలో జరగనున్న పార్టీ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని మూర్తి పిలుపునిచ్చారు. గోల్కొండ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఉదయ్‌కిరణ్, డి.రాజేష్, ఎస్.భాస్కర్, మారపల్లి మల్లేశం, భుజేందర్, ఎల్.మమతతో పాటు వివిధ జిల్లాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

లయన్స్ జీవన సాఫల్య పురస్కారం ప్రదానం

హన్మకొండ కల్చరల్: లయన్స్ అంతర్జాతీయ సేవ సంస్థలో ప్రతిష్ఠాత్మకమైన 320ఎఫ్ జిల్లా గవర్నర్‌గా 2019 –20లో సేవ చేసినందుకు ప్రముఖ కవి, రచయిత లయన్ పొట్లపల్లి శ్రీనివాసరావుకు జీవన సాఫల్య పురస్కారం అందజేశారు. హనుమకొండలోని ఎస్ఆర్‌సీ స్కూల్‌లో లయన్ అంతర్జాతీయ సంస్థ ఆధ్వర్యంలో వరంగల్ ఆధ్వర్యంలో జరిగిన 2021 –22 లయన్‌స్టిక్ సంవత్సరానికి అచీవ్ అవార్డ్స్ నైట్ మహోత్సవంలో గురువారం రాత్రి పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో లయన్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ ఎం.విద్యాసాగర్‌రెడ్డి, జిల్లా గవర్నర్ ముచ్చ రాజిరెడ్డి, ప్రస్తుత గవర్నర్ కన్నా పరశురాములు, వైస్ చైర్మన్ కోటేశ్వరావు, డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి, జాన్‌బన్నీ, గోపాల్‌రెడ్డి, కె.వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న శ్రీనివాసరావు

ఐనవోలు జాతరకు పారిశుద్ధ్య సిబ్బంది



జాతరకు తరలివెళ్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

వరంగల్ అర్బన్: ఐనవోలు జాతరలో విధులు నిర్వహించేందుకు వరంగల్ బల్దియా పారిశుద్ధ్య సిబ్బంది శుక్రవారం తరలివెళ్లారు. జాతరలో పారిశుద్ధ్య పనుల నిమిత్తం 126మందిని కేటాయించారు. శానిటరీ సూపర్‌వైజర్, ఆరుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 12మంది శానిటరీ జవాన్లు, నలుగురు హెల్త్ అసిస్టెంట్లు, 80 మంది పారిశుద్ధ్య కార్మికులు, 16మంది మలేరియా సిబ్బందితోపాటు రెండు స్లీపింగ్ మిషిన్లు, ట్రాక్టర్, నాలుగు స్వచ్ఛ ఆటోలు, డంపర్ ప్లేసర్, షీ టాయిలెట్ వాహనాలను తరలించినట్లు సీఎంహెచ్ఓ డాక్టర్ జ్ఞానేశ్వర్ వివరించారు. షిఫ్టులవారీగా నాలుగు రోజులపాటు జాతరలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

సంక్షిప్తంగా

కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యదర్శిగా రమేష్ యాదవ్



కాజీపేట: తెలంగాణ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శిగా కాజీపేట మండలం సోమిడి గ్రామానికి చెందిన బైరబోయిన రమేష్ యాదవ్‌ను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవగా రమేష్‌ను నాయిని సన్మానించారు.

గెజిటెడ్ హెచ్ఎం అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ సంఘం హనుమకొండ జిల్లా శాఖ రూపొందించిన నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను అదనపు కలెక్టర్ సంధ్యారాణి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ హనుమకొండ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నెహ్రూ, ఆర్థిక కార్యదర్శి వెంకన్న, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు రాజన్న, జిల్లా బాధ్యులు పట్టాభి, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి బిడ్డ పత్రిక క్యాలెండర్..

హన్మకొండ అర్బన్: తెలంగాణ రెడ్డి బిడ్డ పత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను పోస్టల్ కాలనీలోని రెడ్డి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపు జైపాల్‌రెడ్డి, తెలంగాణ రెడ్డి బిడ్డ రాష్ట్ర ప్రతినిధి కామిడి సతీష్‌రెడ్డి, సలహాదారుడు రావుల నర్సింహారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోస్టల్ కాలనీ అధ్యక్షుడు నల్ల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చాడ జైహింద్‌రెడ్డి, నాయకులు తాటిపల్లి గణపతిరెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, సంజీవరెడ్డి, నర్సింహరెడ్డి, హనుమంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి జ్ఞాపకార్థం అన్నదానం

కాజీపేట: కాజీపేట చౌరస్తాలో చిరువ్యాపారుల సంఘం సభ్యుడు రాంకిశోర్ ఉపాధ్యాయ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ శుక్రవారం ప్రారంభించారు. చిరువ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో సహచర మిత్రుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగ్, ఆర్టీఏ కమిటీ సభ్యుడు కాటపురం రాజు, పీస్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ సర్వర్, సుంచు కృష్ణ, నార్లగిరి రమేష్, సోని, మహమూద్, బండి రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్?

కాజీపేట: ద్విచక్ర వాహనాలను చోరీకి పాల్పడుతూ తక్కువ ధరలకు విక్రయిస్తూ జల్సాలు చేస్తున్న ఇద్దరు యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు కాజీపేట చౌరస్తాలో శుక్రవారం అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు కాజీపేట వైఎస్సార్‌నగర్ కాలనీలో స్థిర నివాసం ఏర్పర్చుకున్న ఇద్దరు యువకులు.. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొద్దికాలంగా ఇళ్ల ముందు పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలను గుట్టుచప్పుడు కాకుండా తస్కరించి కాజీపేటకు చేరుకుంటున్నారు. ఈక్రమంలో ఆధునిక సాంకేతికతతో నిందితుల ఆచూకీని టాస్క్‌ఫోర్స్ పోలీసులు కనిపెట్టి వారిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించినట్లుగా ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. స్థానిక పోలీసులు మాత్రం అలాంటిది ఏమీలేదని తెలిపారు.